ఉల్లాసంగా.. ఉత్సాహంగా

- ఊహించని రీతిలో పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓట్ల పోలింగ్
- ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసుల చర్యలు

పొదలకూరు : తూర్పు రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి సోమవారం జరిగిన పోలింగ్‌లో ఓటర్లు ఉత్సాహంగా తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పటిష్టమైన పోలీసు బందోబస్తు మధ్య అధికారులు ఎన్నికలను నిర్వహించారు. పొదలకూరులో ఏర్పాటు చేసిన మూడు పట్టభద్రుల పోలింగ్ కేంద్రాల్లోని 155వ కేంద్రంలో 1,351 ఓట్లు ఉండడంతో సాయంత్రం 5.45 గంటల వరకు పోలింగ్ కొనసాగింది. ఈ బూత్‌లో 821 ఓట్లు పోలయ్యాయి. మిగిలిన అన్ని కేంద్రాల్లో 4 గంటలకే అధికారులు పూర్తి చేశారు. అయితే ఊహించని రీతిలో పట్టభద్రుల ఓట్లు శాతం పోల్ కావడం విశేషం. ఓటర్లు దూరప్రాంతాల్లో ఉండడం, ఆన్‌లైన్లో ఓట్లను నమోదు చేసుకుని ఉండడంతో పోలింగ్‌కు వస్తారా.. లేదా భావించారు. ఈ నేపథ్యంలో మధ్యాహ్నం నుంచి పోలింగ్ శాతం పెరిగింది. పొదలకూరులో మొత్తం ఎమ్మెల్సీ ఎన్నికల కోసం నాలుగు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. 155, 156, 156ఏ పట్టభద్రుల కోసం ఏర్పాటు చేయగా, 84 పోలింగ్ కేంద్రాన్ని ఉపాధ్యాయ ఓటర్ల కోసం ఏర్పాటు చేశారు. సీఐ జి.సంగమేశ్వరరావు, ఎస్సై ఎస్‌కే కరిముల్లా గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

వెంకటాచలంలో..

వెంకటాచలం : మండల పరిధిలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. పట్టభద్రుల ఓటర్లకు రెండు పోలింగ్ కేంద్రాలు 154, 154–ఏ, ఉపాధ్యాయ ఓటర్లకు 83వ నంబర్ పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. 154–ఏ కేంద్రంలో పోలింగ్ ఆలస్యంగా నమోదైంది. పోలింగ్ కేంద్రం 154లో 347 మంది పురుషులు, 204 మంది మహిళలు, 154–ఏలో పురుషులు 399 మంది, మహిళలు 198 మంది ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే ఉపాధ్యాయ ఓటర్లకు సంబంధించి 39 మంది పురుషులు, 44 మంది మహిళలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోలింగ్ కేంద్రం వెలుపల వైఎస్సార్‌సీపీ, టీడీపీ నేతల మధ్య స్వల్ప వివాదం మినహా పోలింగ్ ప్రశాంతంగా జరిగింది. అడిషనల్ ఎస్పీ హిమవతి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు.

- **ముత్తుకూరు :** ముత్తుకూరులో పట్టభద్రుల కోసం రెండు పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. పోలింగ్ బూత్‌ల సమీపంలో ప్రధాన పార్టీలకు చెందిన నాయకులు పెద్ద సంఖ్యలో మోహరించారు. కృష్ణపట్నం సీఐ వేమారెడ్డి ఆధ్వర్యంలో ముత్తుకూరు, కృష్ణపట్నం ఎస్సైలు శివకృష్ణారెడ్డి, అంజిరెడ్డి తదితరులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుడా చర్యలు తీసుకున్నారు. అడిషనల్ ఎస్పీ హిమవతి పోలింగ్ సరళిని పరిశీలించారు. నెల్లూరు డివిజన్‌లో పోలింగ్ ప్రశాంతంగా జరిగిందన్నారు.
- **మనుబోలు :** మండల కేంద్రంలోని స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో పట్టభద్రులకు రెండు, ఉపాధ్యాయులకు ఒక పోలింగ్ కేంద్రాన్ని అధికారులు ఏర్పాటు చేశారు. మండలంలోని వారే కాకుండా బెంగళూరు, హైదరాబాద్ తదితర ఇతర నగరాల్లో స్థిరపడిన స్థానికులు సైతం వచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకోవడం విశేషం. పీహెచ్‌సీ ఆధ్వర్యంలో పోలింగ్ కేంద్రాల వద్ద వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.
- **తోటపల్లిగూడూరు :** తోటపల్లిగూడూరు ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో సోమవారం ఉదయం 8 గంటలకు ప్రారంభమైన పోలింగ్ సాయంత్రం 5.30 గంటల వరకు కొనసాగింది. మండల ఇన్‌చార్జి తహసీల్దార్ శివయ్య, ఎంపీడీఓ హేమలత, పోర్ట్ సీఐ వేమారెడ్డి పోలింగ్‌ను పర్యవేక్షించారు. జిల్లా అడిషనల్ ఎస్పీ హిమవతి, డీఎస్పీ గాంధీలు పరిశీలించారు.


వెంకటాచలం : పోలింగ్ కేంద్రం వద్ద బారులు తీరిన ఓటర్లు

సర్వేపల్లి నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో పోలింగ్ సరళి ఇలా..

పట్టభద్రులకు సంబంధించి

మండలం	ఓటర్లు	పోలైనవి	శాతం
వెంకటాచలం	1,528	1,148	72
ముత్తుకూరు	1,510	1,175	77.81
పొదలకూరు	2,539	1,641	65
మనుబోలు	1,238	984	71.48
టీపీగూడూరు	1,216	929	76

ఉపాధ్యాయులకు సంబంధించి

మండలం	ఓటర్లు	పోలైనవి	శాతం
వెంకటాచలం	91	83	91.21
ముత్తుకూరు	49	48	97.96
పొదలకూరు	166	144	86.7
మనుబోలు	56	51	91
టీపీగూడూరు	47	45	95


పొదలకూరులో బిడ్డతో వచ్చి ఓటు వేసిన పట్టభద్రురాలు


ముత్తుకూరులో ఓటు వేసేందుకు బారులు తీరిన పట్టభద్రులు


తోటపల్లిగూడూరు పోలింగ్ కేంద్రంలో..


ముత్తుకూరులో ఓటు వేసేందుకు బారులుతీరిన ఉపాధ్యాయులు


మనుబోలు : ఓటరు జాబితాను పరిశీలిస్తున్న పోలింగ్ ఏజెంట్లు



ముత్తుకూరు : పోలింగ్ కేంద్రాల సమీపంలో మోహరించిన నాయకులు


ముత్తుకూరు : పోలింగ్ ప్రక్రియపై చర్చిస్తున్న అడిషనల్ ఎస్పీ హిమవతి

ప్రశాంత వాతావరణంలో..

- పోలింగ్ సరళిని పరిశీలించిన ఎమ్మెల్యే ప్రసన్న

కోవూరు : కోవూరు జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో సోమవారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలోని వివిధ గ్రామాల నుంచి పట్టభద్రులు, ఉపాధ్యాయులు ఓటు వేసేందుకు తరలివచ్చారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి, సీఐ కె.రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటుచేశారు. సీఐ కె.రామకృష్ణారెడ్డి, ఎంపీడీఓ శ్రీహరి ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ సందర్భంగా పోలింగ్ సరళిని కోవూరు ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి ఎమ్మెల్యేతో పాటు డీఏఏబీ చైర్మన్ డి.నిరంజన్‌బాబురెడ్డి, ఏఎంసీ చైర్మన్ పి.రాధాకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఎస్.సుబ్బారెడ్డి, సొసైటీ అధ్యక్షుడు ఆర్.మల్లికార్జునరెడ్డి పాల్గొన్నారు.

విడవలూరులో..

విడవలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ కేంద్రాల్లో పట్టభద్రులు, ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి విడవలూరులో పర్యటించారు. ఆప్కాఫ్ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బెజవాడ గోవర్ధన్‌రెడ్డి, పార్టీ మండల గౌరవాధ్యక్షుడు కాటంరెడ్డి నవీన్‌కుమార్‌రెడ్డి, స్థానిక నేతలు పూండ్ల అచ్యుత్‌రెడ్డి, రామిరెడ్డి విజయభాను రెడ్డి, బెజవాడ వంశీకృష్ణారెడ్డి, బుచ్చింగారి తిరుపతి, తుమ్మల లక్ష్మయ్య, కొల్లూరు లక్ష్మీనారాయణరెడ్డి ఉన్నారు.

- **ఇందుకూరుపేట :** మండలంలోని కొత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో ఉదయం మందకొడిగా ప్రారంభమై మధ్యాహ్నం ఊపందుకుంది. కాగా పోలింగ్ సరళిని ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి పరిశీలించారు. ఆయన వెంట డీఎల్‌డీఏ చైర్మన్ గొల్లపల్లి విజయ్ కుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మావులూరు శ్రీనివాసులురెడ్డి, డీసీఎమ్మెస్ డైరెక్టర్ గునుపాటి సురేష్‌రెడ్డి, నాయకులు కె.శ్రీనివాసులురెడ్డి, డి.చంద్రమోహన్‌రెడ్డి, జి.ప్రభాకర్‌రెడ్డి, యు.వెంకటశేషయ్య ఉన్నారు. అలాగే ఏఎస్పీ హిమవతి, రూరల్ డీఎస్పీ రామంజనేయరెడ్డి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు.

బుచ్చిలో..

బుచ్చిరెడ్డిపాళెం : పట్టణంలోని డీఎల్ఎస్ఆర్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగినట్లు తహసీల్దార్ పద్మజ, ఎంపీడీఓ నరసింహారావు తెలిపారు. ఉదయం 8 గంటల నుంచే ఓటర్లు పోలింగ్ కేంద్రానికి చేరుకుని ఓటు వేశారు. సాయంత్రం 4 గంటల తరువాత కూడా ఓటర్లు క్యూలో ఉండటంతో 4.50 గంటల వరకు పోలింగ్ సాగింది.

ఓటు హక్కు వినియోగించుకున్న డీఐజీ

బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన గుంటూరు రేంజ్ డీఐజీ రాజశేఖర్‌బాబు తన కుమార్తెతో కలిసి ఓటు హక్కును వినియోగించుకున్నారు. అలాగే బుచ్చిరెడ్డిపాళెంలో జరిగిన ఓటింగ్ సరళిని కోవూరు ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి, రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి పర్యవేక్షించారు.

- **కొడవలూరు :** కొడవలూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రంలో తొలుత మందకొడిగా సాగింది. ఉదయం 10 గంటలకు కేవలం 8 శాతం మాత్రమే పట్టభద్రుల ఓట్లు పోలయ్యాయి. మధ్యాహ్నం 12 గంటలకు 29 శాతం ఓట్లు పోలయ్యాయి. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి పోలింగ్ ఊపందుకొంది. ఓటర్లు ఓటు వేసేందుకు క్యూలో బారులు తీరారు. వికలాంగులు సైతం మూడు చక్రాల వాహనాలపై వచ్చి ఓటు హక్కును వినియోగించుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి ఉదయం 11 గంటలకు కొడవలూరు చేరుకుని పోలింగ్ సరళిని పరిశీలించారు. ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా నాయకులు కృషి చేయాలని సూచించారు. డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు కొడవలూరులో ఓటు హక్కును వినియోగించుకున్నారు. నెల్లూరు రూరల్ డీఎస్పీ వీరాంజనేయరెడ్డి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించి సిబ్బందికి సూచనలిచ్చారు. ఎస్సై సుబ్బారావు ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు. తహసీల్దారు రమాదేవి ఎన్నికల ప్రక్రియను పర్యవేక్షించారు.


ఇందుకూరుపేట : ఓటు హక్కు వినియోగించుకున్న మహిళలు


బుచ్చిరెడ్డిపాళెం: సాయంత్రం 4 గంటల తరువాత కూడా క్యూలో ఉన్న ఓటర్లు


కోవూరులో పోలింగ్ సరళిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ప్రసన్న


బుచ్చిరెడ్డిపాళెం: ఓటు వేసేందుకు అంధురాలిని తీసుకొస్తున్న దృశ్యం


కొడవలూరు : సీఐ, ఎస్సైలకు సూచనలిస్తున్న డీఎస్పీ వీరాంజనేయరెడ్డి


బుచ్చిరెడ్డిపాళెం: చంటి బిడ్డతో ఓటు వేసిన మైథిలి


ఇందుకూరుపేట : కొత్తూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో బారులు తీరిన ఓటర్లు

కోవూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో పోలింగ్ సరళి ఇలా..

పట్టభద్రులకు సంబంధించి

మండలం	ఓటర్లు	పోలైనవి	శాతం
విడవలూరు	1,337	996	74.49
కొడవలూరు	1,524	1,067	70.01
బుచ్చిరెడ్డిపాళెం	3,814	2,503	65.20
కోవూరు	3,111	2,019	65.07
ఇందుకూరుపేట	1,501	1,137	75.75

ఉపాధ్యాయులకు సంబంధించి

మండలం	ఓటర్లు	పోలైనవి	శాతం
విడవలూరు	57	52	91.23
కొడవలూరు	60	55	91.67
బుచ్చిరెడ్డిపాళెం	388	357	92.01
కోవూరు	232	214	92.24
ఇందుకూరుపేట	68	66	97.06


కోవూరు జెడ్పీ పాఠశాలలో బారులుతీరిన ఓటర్లు


కోవూరు : ఓటు వేసిన పక్షవాత బాధితుడు తిరుపతిరెడ్డి


ఇందుకూరుపేట : ఎన్నికల కేంద్రం వద్ద ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి


కొడవలూరు : ఓటు హక్కు వినియోగించుకున్న డీసీఎమ్మెస్ చైర్మన్ చలపతిరావు

క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు


క్షతగాత్రుడిని అంబులెన్స్‌లో తరలిస్తున్న సిబ్బంది

వెంకటాచలం : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి గాయపడిన సంఘటన మండలంలోని ఎర్రగుంట వద్ద జాతీయ రహదారిపై సోమవారం జరిగింది. గూడూరు వైపు నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న లారీ ఎర్రగుంట వద్ద ఆగిన సమయంలో వెనుక నుంచి వేగంగా వస్తున్న మోటారు బైక్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న వ్యక్తికి గాయాలవడంతో చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఆస్కార్ అవార్డుపై సంబరాలు

ఉదయగిరి: ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలోని నాటు నాటు పాటకు గానూ తెలుగు సినీ సంగీత దర్శకుడు కీరవాణి, పాటల రచయిత చంద్రబోస్ ఆస్కార్ అవార్డు అందుకోవడంపై ఉదయగిరి బస్టాండ్‌లో అభిమానులు సోమవారం సంబరాలు జరుపుకొన్నారు. బాణసంచా కాల్చి మిఠాయిలు పంచిపెట్టి అభిమానాన్ని చాటుకున్నారు. సాగర్ సేవా సమితి అధ్యక్షుడు మన్సూర్‌అలీ, సురేష్, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలోని తెలుగు గంగ సబ్‌స్టేషన్లో మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా మంగళవారం ఉండదని ఐఈ సెక్షన్ ఏఈ లక్ష్మీనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. శివాజీనగర్, ఎన్‌సీసీ కాలనీ, ఎస్పీటీ కాలనీ, తదితర ప్రాంతాల్లో ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సరఫరా ఉండదన్నారు.

- వైఎంసీఏ సబ్‌స్టేషన్ పరిధిలోని దర్గామిట్ట ఫీడర్‌లో మరమ్మతుల కారణంగా అరవిందనగర్, శోధన్‌నగర్, ఆర్టీసీ బస్టాండ్, జిల్లా కోర్టు, తదితర ప్రాంతాల్లో ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదని వెస్ట్ – 1 ఏఈ లక్ష్మీబాయ్ పేర్కొన్నారు.

‘విశ్వవేదికపై తెలుగు పాటకు అపురూప గౌరవం’


నెల్లూరు(బృందావనం): ఆర్‌ఆర్‌ఆర్ చిత్రంలోని నాటు.. నాటు పాటకు ఆస్కార్ అవార్డు రావడం విశ్వవేదికపై తెలుగు సాహిత్యానికి దక్కిన అపురూప గౌరవమని పలువురు పేర్కొన్నారు. ఈ మేరకు నెల్లూరుకు చెందిన కవులు, రచయితలు పెరుగు రామకృష్ణ, సుబ్బారావు, రచయితల సంఘ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జయప్రకాష్, అన్నపూర్ణ వేర్వేరు ప్రకటనలను సోమవారం విడుదల చేశారు.

త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



నెల్లూరు(బృందావనం): బాలాజీనగర్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారాన్ని త్రైత సిద్ధాంత – ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక నెల్లూరు కమిటీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిటీ నగరాధ్యక్షుడు సురమౌళి మాట్లాడారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన ఆధ్యాత్మిక త్రైత సిద్ధాంత గ్రంథాల విశిష్టతపై ప్రచారం చేస్తున్నామని చెప్పారు. కమిటీ సభ్యులు నరసింహప్రసాద్, సోమశేఖర్, ప్రసాద్, నారాయణమ్మ, మనోజ, రఘురామయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆ భూములు దళితులవే..


మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు రూరల్: అంబాపురంలోని శాలివాహన కల్యాణ మండప సమీపంలో గల భూములు స్థానిక దళితులవేనని పలువురు ముస్లిం మైనార్టీ నేతలు పేర్కొన్నారు. ఈ మేరకు అంబాపురంలోని స్థలాల వద్ద విలేకరులతో సోమవారం వారు మాట్లాడారు. ఈ ప్రాంతంలోని భూములను దళితులకు ప్రభుత్వం ఎన్నో ఏళ్ల క్రితం కేటాయించిందని చెప్పారు. కొందరు తమ స్వార్థ ప్రయోజనాల కోసం విమర్శలు చేస్తున్నారని, ఇది సమంజసం కాదని హితవు పలికారు. సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బయ్య, మన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు, ముస్లిం మైనార్టీలు జిలానీ, రియాజ్, కాలేషా, బాబు, అజీజ్, సిరాజ్, ఖాజా, తదితరులు పాల్గొన్నారు.



మంత్రికి సత్కారం

నెల్లూరు(సెంట్రల్): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నగరంలోని ఆయన క్యాంప్ కార్యాలయంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గ్రీవెన్స్ సెల్ జిల్లా అధ్యక్షుడు సురేంద్రబాబు మర్యాదపూర్వకంగా సోమవారం కలిశారు. ఈ సందర్భంగా మంత్రిని సత్కరించారు. తనకు పదవి వచ్చేలా సహకరించినందుకు కృతజ్ఞతలను తెలియజేశారు.

ఆత్మహత్య కేసు సంతపేట పీఎస్‌కు బదిలీ

నెల్లూరు(క్రైమ్): తండల్ వ్యాపారి వేధింపులను తాళలేక ఆత్మహత్యకు పాల్పడిన ఆటో డ్రైవర్ కేసు రైల్వే పోలీసుల నుంచి సంతపేట పోలీసులకు బదిలీ అయింది. వివరాలు.. జనార్దన్‌రెడ్డికాలనీకి చెందిన ఆటోడ్రైవర్ ఏసుదాస్ (53) తన వ్యక్తిగత అవసరాల నిమిత్తం సంతపేటలోని ఉప్పరపాళేనికి చెందిన ఓ తండల్ వ్యాపారిని వద్ద నగదును అప్పుగా తీసుకున్నారు. రోజువారీ నగదు చెల్లింపులు ఆలస్యం కావడంతో ఏసుదాస్‌పై సదరు వ్యాపారిని నానా దుర్భాషలాడి వేధింపులకు గురిచేయడం ప్రారంభించారు. ఆమె వేధింపులు తాళలేక తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని బాధితుడు లేఖ రాసి గత నెల 26న అర్ధరాత్రి రైలు కిందపడి బలవన్మరణానికి పాల్పడ్డారు. ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదు చేశారు. తండల్ వ్యాపారి వేధింపులే ఏసుదాస్ ఆత్మహత్యకు కారణమని వారి విచారణలో వెల్లడైంది. తండల్ వ్యాపారి నివసిస్తున్న ప్రాంతం, మృతుడు నగదు తీసుకున్న ప్రాంతం, వ్యాపారి అతడ్ని దుర్భాషలాడిన ప్రాంతం సంతపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోవి కావడంతో కేసును బదిలీ చేస్తూ ఉత్తర్వులను జిల్లా పోలీస్ కార్యాలయానికి గుంతకల్ రైల్వే ఎస్పీ సోమవారం పంపారు.

త్యాగరాజస్వామికి గాన నీరాజనం


అక్షయ్ పద్మనాభన్ గాత్రకచేరి

నెల్లూరు(బృందావనం): నగరంలోని పురమందిర ప్రాంగణంలో త్యాగరాజ స్మరణోత్సవాలను భిక్షాటన పూర్వక త్యాగరాజ స్మరణోత్సవ సభ ఆధ్వర్యంలో వేడుకగా నిర్వహిస్తున్నారు. వాగ్గేయకారుడు త్యాగరాజస్వామికి తమ గాత్రంతో కళాకారులు నీరాజనం పలుకుతున్నారు. వెంకటేశ్వర స్వామి రూపంలో దేవదేవుడు కొలువై భక్తులను అనుగ్రహించారు. చెన్నైకి చెందిన సంగీత విద్వాంసుడు అక్షయ్ పద్మనాభన్ గాత్రకచేరి అలరించింది. విశ్వేష్ చంద్రశేఖర్ (వయోలిన్), గురు రాఘవేంద్ర (మృదంగం), శివరామకృష్ణన్ (కంజీర) వాద్య సహకారం అందించారు. కదిరికి చెందిన కథకులు శ్రీవాణిభాగవతారిణితో పద్మవ్యూహ హరికథా గానం, హైదరాబాద్‌కు చెందిన కథకుడు శ్రీరామ్‌భట్టార్ భాగవతార్‌తో భక్త అన్నమయ్య హరికథా గానం వీనులవిందుగా సాగింది. వీరికి కృష్ణమూర్తి (హార్మోనియం), శాంతికళాధర్ (మృదంగం), సుబ్రహ్మణ్యం (వయోలిన్), నగధరరావు వాద్య సహకారం అందించారు. స్మరణోత్సవ సభ కమిటీ అధ్యక్ష, శాశ్వత కార్యదర్శి శ్రీరామ్మూర్తి, నాగదేవీప్రసాద్, తదితరులు పర్యవేక్షించారు.